

# యాక్సిడెంట్

## ఇచ్ఛాపురపు జగన్నాధరావు

టేబిల్ మీది ఫొటో అతన్ని వెక్కిరిస్తోంది.

పగటికన్నా రాత్రివేళ ఆ ఫొటో ఎక్కువగా వెక్కిరిస్తోంది. కొన్ని అందాలు పగలు కనపడవు-అలాగే కొన్ని అర్థాలు కూడా, కాబోలు!

పార్వతి చాలా అందమైనది.

ఆమె కళ్ళల్లోకి చూస్తోంటే, అన్నీ మరిచిపోతాడు తాము-కవీసం, మొన్న మొన్నటి దాకా అలాగే - అన్నీ మరిచిపోయేవాడు. ఆమెకి దూరంగా వుండి ఆ కళ్ళు జ్ఞాపకం వొస్తే, మరిచిపోయినవన్నీ జ్ఞాపకంవొచ్చి తహతహలాడేవాడు.

ఆమెకి దగ్గరగా వుంటే వుక్కిబిక్కిరి.

ఆమెకి దూరంగావున్నా అంతే

స్వామికి ఇప్పుడు ఆ ఫొటో కళ్ళు చూపినా, అన్నీ మరపురావడంలేదు అన్నీ జ్ఞాపకం వొస్తున్నాయి.

పెద్ద ఫొటో.

ఆమెది ఒక్కటీవి.

ఆ చిన్న గదిలో ఎక్కడ కూర్చున్నా ఆ కళ్ళు తననే వెతుకుతున్నాయనిపిస్తుంది. ఆ పెద్ద ఫొటోలోని పెద్ద కళ్ళు, ఆ ముఖంలోని అంత అందమూ ఆ కళ్ళే దాచుకున్నట్టు వుంటుంది.

మొన్న మొన్నటిదాకా, పార్వతి ఆ టేబిల్‌కి ఆనుకూర్చుని తనతో కబుర్లు చెప్పేది.

అంటే తన మాటలన్నీ విని, చిరునవ్వుతోనో, ఒకటి రెండు మాటలతోనో, సమాధానం ఇచ్చేది. అంతే! కాని, ఆ చిరునవ్వులోనూ, ఆ ఒక్క రెండు మాటల్లోనూ, ఎంతో మాధుర్యం వుండేది.

ఏమిటో, రెండు నెలలే అయినా, ఆ జీవితం ఎప్పటిదిలాగనో వుంది.

స్వామి టేబిల్ మీది గడియారం చూశాడు. రెండు దాటింది.

అందరూ నిద్రపోతూ వుంటారు. రాత్రి ఈవేళ ఎవరు తనలాగ మేలుకుని, ఫొటో వైపూ, గడియారం వైపూ చూస్తూ కూర్చుంటారు?

పార్వతికూడా నిద్రపోతోనే వుంటుంది. అక్కడ.

ఆ ఊళ్ళో.

అసలే ఆమెకి నిద్ర ఎక్కువ. చిన్నప్పటి నించీ అంతేనని వాళ్ళ అమ్మ చెప్పింది.

అదీ జ్ఞాపకం వుంది.

పెళ్ళి చూపులకి వెళ్ళడమూ, పిల్ల నచ్చిందని చెప్పడమూ, వారివ్వలేమన్న కట్నాలూ కానుకలూ తాము కోరబోమని తానే చెప్పడం —నాన్నకీ అమ్మకీ బలేకోపం వొచ్చింది. పుట్టి బుద్ధి తెలిశాక వారిమాట కాదనడం అదే మొదటిసారి!

"ఇన్నాళ్లు కని పెంచాం. కాస్త ఎర్రగా పిల్ల కనిపించేసరికి మమ్మల్ని ఒక్కసారి కాదంటావా?" అన్నది వాళ్ళ మాటలో సారాంశం.

పార్వతి ఎర్రగా వుండడమేకాదు. ఆమెలో దాటిపోలేని పిలుపు లెన్నో కనిపించాయి స్వామికి. ఆమె రూపం ముందు ఎంత డబ్బయినా దిగదుడుపుగానూ, అంత వరకూ ఆమెని చూడడానికి వొచ్చి కట్నాల దగ్గర బేరం కుదరక కాదన్న వరులంతా గుడ్డి మూర్ఖులుగానూ అతనికి అనిపించింది.

ఆ క్షణంనించి స్వామి ఆలోచనల్లో పార్వతి తప్పలేదు....ముహూర్తం పెట్టడం, పెళ్ళి....అన్నీ కలలలాగా చకచక అయి

పోయాయి.

ఆమెతో సహజీవనంలో, సహవాసంలో సంసారంలో మొదటి రాత్రులూ పగలు ఒక తియ్యటి కలనించి మరొక తియ్యటి కలలాగా సాగేయి. ఎప్పుడో కలలనించి నిజానికి రావాలనీ, ఆ మేలుకోవడంలో ఆ సుఖం వుందనీ స్వామికి ఆలోచనే రాలేదు. అంత ప్రగాఢమైన కలల రోజులలో ఆఫీసుకి పోవాలంటే ఎంత కష్టంగానో వుండేది!

ఇలాటి రాత్రి, ఇలాగ కూర్చుని యిలాంటి ఆలోచనల్తో మనసంతా కల్లోలం చేసుకునే పరిస్థితి సంభవిస్తుందని స్వామి ఆ కలల్లో కలగనలేదు.

ఒకవిధంగా తప్పు తనదీ వుంది అందులో. ఆలోచించి చూస్తే, ఈనాటి బాధలకి మొట్ట మొదటి కారణం తన ఆలోచనలూ, తన మిత్రులు యిచ్చిన సలహాలూ, తనకే తెలీకుండానే వాటి వెనక దాగిన స్వార్థమూను....అదంతా తనకి చూచాయగా తెలిసింది ముందు. రాను రానూ స్పష్టం అయింది.

కాని, పార్వతి తనకెంతో ఆమెకీ తానంత అయివుంటే ఆ పరిస్థితుల కామె లొంగి వుండేదికాదు. అదీ నిజమే.

ప్రతి గాలి వానకీ మొదలు చినుకుల్లోనే వున్నట్టు, స్వామి తన జీవితంలో వొచ్చిన ఈ గాలివానకి వుపోద్ఘాతమైన చినుకులని మరిచిపోలేడు.

తన వివాహమైన కొత్తలో అతని స్నేహితుల సంఖ్యా, సాన్నిహిత్యమూ, ఒక్కసారి పెరిగాయి. చాలామంది అతనికీ ఆమెకీ విందులిచ్చారు. అందరినీ పిలిచి అతనూ భోజనం పెట్టేడు.

అంతటితో అవి సుమారుగానైనా అంత మవుతాయని అతను ఆశపడ్డాడు. ఈ రాకపోకలు అతనికీ ఆమెకీ మధ్యన వున్న విలువైన క్షణాలని హరించేయడం స్వామికంత నచ్చలేదు. పార్వతి కదంతా బాగుంది. పరస్పర సమావేశాలలో ఆమె చాలా సంతోషంగా కనిపించేది.

అది అతనిలో ప్రత్యేకమైన భయాన్ని కలుగజెయ్యలేదు. నిజానికి ఆమె అంత తక్కువగా మాట్లాడడం, అందరికీ అంత దూరంగా వుండడం అతనికి నచ్చలేదు. మధ్య మధ్యన మిత్రుల్లో కొంతమంది వివాహితులూ, అవివాహితులూ కూడా సూటిగా కాకుండానే, ఈరోజుల్లో స్త్రీలు కొంత స్వేచ్ఛగా వుండడం అవసరం ఎంత వుందో విశదీకరించి, పార్వతి అంతంత దూరంలో అంత దాగుని వుండడం స్వామికి చాలా అవమానమన్న భావనని అతని మనస్సులో కలుగజేశారు.

"అలాగ మగవాళ్ళ ముందు మసలడమంటే నాకు సిగ్గు" అంది పార్వతి. కాని క్రమక్రమంగా ఆమెని సులభంగానే అతను తనకి నచ్చిన దారిలోకి తిప్పుకో గలిగాడు. ఆ విషయంలో తన విజయం అతని కప్పుడు కొంత గర్వం కలుగజేసినదీ నిజమే.

ఆమె స్వేచ్ఛగా ప్రవర్తించడం మొదట అతనికి చాలా ఆనందం కలుగజేసింది. కాని, పార్వతికి స్వామి మనసులోవున్న హద్దులు తెలీలేదు.

ఒక్కొక్కప్పుడు అతనికి వొచ్చిన అతిథులు వెళ్ళిపోవాలనీ, పార్వతితో ఏకాంతం కావాలనీ బలమైన కోరిక వుండేది.

అతనికి బాగా జ్ఞాపకం.

ఒక సాయంత్రం మంచి వర్షం పడుతోంటే వొచ్చాడు సుబ్బారావు.

"ఏమిటి యిలాగ వొచ్చావు?" అన్నాడు కూర్చోబెట్టి, స్వామి. నిమిషం కిందటి వెచ్చటి, తియ్యటి క్షణాలు యింకా అతన్ని వొదలనేలేదు.

"ఏమీలేదు....ఇంట్లో ఏం తోచకపోతే యిలా వొచ్చేశాను...." అన్నాడు సుబ్బారావు. అతనికి మూడేళ్ళ క్రిందట పెళ్ళయింది. ఇద్దరు పిల్లలు. వాళ్ళని ముగ్గురు చెయ్యడానికి వాళ్ళావిడ పుట్టినింటికి వెళ్ళింది.

బయట వర్షం పడుతోంది. కొంచెం కొంచెం చీకటి; అక్కడా అక్కడా వీధిలోనీ, ఇళ్ళలోనీ, దీపాలు.

వాణ్ణి తొందరగా పంపేసెయ్యాలనీ. ఇంత అందంగావున్న ఈవేళ రాత్రిని ప్రత్యేకంగా అలంకరించుకోవాలనీ వుంది అతనికి.

ఎలాగ అని ఆలోచిస్తూ కూర్చున్నాడు, స్వామి ఏమీ మాట్లాడకుండానే.

సుబ్బారావు ఏవో గొడవలు, ఆఫీసువీ, తన పిల్లలవీ, అవీ, ఇవీ చెప్తున్నాడు.

పరధ్యానంగా, ఊం కొడుతున్నాడు స్వామి సుబ్బారావు వొదిలితే బాగుండునని.

చివరకి అతనికి ఒక ఆలోచన వొచ్చింది.

ఒచ్చిన అతిథిని ఇంట్లోంచి పొమ్మనడం సాధ్యమూకాదు; భావ్యమూకాదు. వీళ్లతోనే తాను ఆఫీసులో దైనందిన జీవితం సాగించాలి.

అందుకని, ఉపాయంగా వీణ్ని పంపాలనిపించింది. అదృష్టవశాత్తూ పార్వతి కాఫీ తేలేదు గనుక....

"చూడు సుబ్బారావూ....సినిమాకి వెళ్ళాలని అనుకున్నాం....ఎనిమిదిన్నర అవనే అయింది...." అన్నాడు, తనమీద పెద్ద కష్టం వొచ్చినట్టు ముఖంపెట్టి, స్వామి.

"ఏ సినిమా?....మంచిదైతే నేనూ వొస్తాను" అన్నాడు సుబ్బారావు.

"ఏదీ అని నాకు తెలీదు. అంతా పార్వతి యిష్టం!" అన్నాడు స్వామి—తన ఆలోచన విఫలమైనందుకు బాధపడుతూ.

పార్వతి రానే వొచ్చింది—బజ్జీలు, కాఫీ పట్టుకుని.

"ఏమమ్మా, ఇప్పుడు ఫలహారం కూడా దేనికీ?" అంటూనే కాఫీ అందుకుని బజ్జీలు తినసాగేడు సుబ్బారావు. ఆమెని ఏదో చేసేద్దామన్నంత కోపం వొచ్చింది స్వామికి.

"ఇంతకీ ఏ సినిమాకి వెడతారూ?" అన్నాడు ఫూ....అంటూ కాఫీ పీలుస్తూ, సుబ్బారావు.

"ఇప్పుడేం సినిమాలెండి!" అంది పార్వతి.

"అది కరక్ట్....అసలీ ఊరిలో అన్ని హాళ్ళూ వర్షానికి కారుతూనే వుంటాయి—స్వామికి ఎప్పుడూ యిలాటి ఆలోచనేలే!" అన్నాడు పార్వతిని కళ్ళతోనే తాగేస్తూ.

పార్వతి చిరునవ్వుతోంది.

"అంటే, అదే—జీవిత భాగస్వామినిగా మిమ్మల్ని వరించడంతప్పు!" అంటూ పెద్దగా నవ్వేశాడు సుబ్బారావు.

పార్వతి ముఖం యింకా కాంతివంతం ఐపోయింది....ఆమె యింకో కుర్చీ తెచ్చుకుని కూర్చుని సంభాషణలో పడింది. స్వామికి వొంటిమీద తేళ్లూ జెర్రెలూ పాకుతూన్నట్టు వుంది. వాళ్లిద్దరూ ఏదో సినిమా గురించి కబుర్లు చెప్పేసుకుంటున్నారు. అందులో జయప్రద ఎంత బాగుందో పార్వతి చెప్తోంది. "ఆడది మెచ్చిందే అందం అంటారు గానీ .... మీరుమాత్రం ఏం తక్కువా?" అంటున్నాడు సుబ్బారావు.







స్వామి వునికినే వాళ్లిద్దరిలో ఎవరూ పట్టించుకోవడంలేదు. ఆవులింతలూ, అవునూ కాదూ, అనకపోవడమూ-ఏదీ వాళ్ల చర్చలో తాత్కాలికంగా కూడా అంతరాయం కలిగించలేదు.

తను వెళ్ళి పడుకున్నాడు—ఎవరితోనూ ఏమీ అనకుండానే. వొద్దంటూన్నా నిద్రపట్టేసింది. సుబ్బారావు ఎప్పుడు వెళ్లేడో, పార్వతి ఎప్పుడు వొచ్చి పడుకుందో అతనికి తెలీదు-ఆమెమీద రగిలి రగిలి వున్న కోపమంతా మర్నాటి వుదయానికి కరిగిపోయింది. ప్రయత్నించినా ఆమెమీద కోపం కొంచెం కూడా చూపలేకపోయాడు. తానేదో తప్పు చేసిన భావన ఆమెలో లేనేలేదు....పసిదాని హృదయం, పార్వతిది అనుకుని సరిపెట్టుకున్నాడు స్వామి.

ఆ తరవాత తన యింటికి రాకపోకలు ఎక్కువ అయాయి. మిత్రులూ, ఒక్కొక్కప్పుడు వాళ్ల మిత్రులూ, సమయా సమయాలలో వొచ్చి కూర్చుని కబుర్లు చెప్తూ వుండేవారు. ఒకటి రెండుసార్లు చూచాయగా పార్వతికి చెప్పిచూశాడు. "చూడు పార్వతీ! ....వీళ్లందరితోనూ హద్దులు పెట్టుకుని ప్రవర్తించాలి...." అన్నాడు ఒకనాడు స్వామి.

పార్వతి తెల్లబోయింది.

"నేను-హద్దులు మీరుతున్నానా?" అంది.

"అదికాదు పార్వతీ.... నేననేది...." అని నసిగాడు స్వామి. ఆ క్షణంలో తానే ఏదో తప్పు-క్షమించరానిది-చేసినట్టు వుందతనికి.

ఎందుకంటే, పార్వతికి దుఃఖం వొచ్చేసింది-ఆపుకోలేని, దాచుకోలేని దుఃఖం. అతను భరించలేకపోయాడు. ఆమెని ఓదార్చడంలో కూడా ఒక తియ్యదనం వున్నా, అతను మళ్లీ అలాటి పరిస్థితి తెచ్చే వుద్దేశం ఏదీ మనసులో పెట్టుకోలేదు.

ఆ తరవాత పార్వతి అతని స్నేహితుల మధ్యకి రావడం పూర్తిగా మానేసింది. ఇది అతనికి కొంత సిగ్గు కలిగించింది. భార్యని.... అందులోనూ, పార్వతిలాటి భార్యని, అనుమానించడం, ఆ విషయంమీద ఈ మధ్య బాగా వ్యాప్తిచెందిన మిత్రలోకంలో వ్యాఖ్యలు-అతనికి చాలా యిబ్బంది కలుగజేశాయి. ఆమెని యివతలికి తీసుకుని వొచ్చేందుకు బ్రతిమిలాడుకోవలసిన అగత్యం వొచ్చింది. కష్టపడి, సఫలుడయాడు స్వామి. మొదట సంశయంగా ఆమె ప్రవర్తించినా, త్వరలోనే పార్వతి ఎప్పటిలాగా ప్రవర్తించసాగింది. ఒక నిట్టూర్పు విడిచాడు స్వామి.

చివరికి ...చిట్టచివరికి అతని సహనం హద్దులు సమీపించింది. పార్వతిని గురించి తన మిత్రులు కొంత తేలిగ్గా మాట్లాడుకుంటున్నారని అతనికి తెలిశాక, అతనికి ఆమె క్రమంగా ఒక సమస్య అయిపోయింది. వచ్చిన వారందరితోనూ ఆమె తేలిగ్గా, హాయిగా, నవ్వుతూ మాట్లాడడం క్రమక్రమంగా అతను భరించరానిదైపోయింది.

ఒకనాడలాగే, ఆఫీసులో ఓవర్‌టైమ్‌చేసి ఆలశ్యంగా యింటికి వొచ్చాడు స్వామి. వుదయంనించీ జ్వరం వొచ్చినట్టు వుంది—శరీరయంత్రానికి బాధ బాగా ఎక్కువైంది. మామూలుగా వీలున్నా ఓవర్‌టైమ్ సరేసరి ఆఫీసుకే సెలవుపెట్టి వుండేవాడు. కాని, తప్పనిసరిగా పనిచెయ్యవలసి వొచ్చింది. ఎందుకంటే, ఆఫీసరుకికోపం వొస్తే ఏజన్సీలో వేస్తాడు. అక్కడ చాలా కష్టాలు.

ఎలాగో పని ముగించుకుని వొచ్చేసరికి పార్వతి నవ్వు వినిపించింది. లోపలికి అడుగుపెట్టేసరికి ఈమధ్య మరీ తరుచుగా యింటికి వొస్తోన్న ప్రకాశం, ఆమె కబుర్లు చెప్పుకుంటూ కాఫీ తాగుతున్నారు.

అతన్నిచూసి, నవ్వుతూనే, "మీ ప్రకాశం -చాలా విట్టీ అండీ! ...పైకలాగే వుంటాడు గాని...."

"ఎలా వుంటానూ!" అన్నాడు ప్రకాశం, పిక్కిష్టు చదువుతోన్నట్టు.

"ఎలాగా?...." నవ్వుతూ, మాటల కోసం తడుముకుంటూ, నవ్వుతోంది పార్వతి. తీక్షణంగా ఆమెని గమనించి అతను లోపలికి వెళ్లి బట్టలు మార్చుకుని పడుకున్నాడు. కళ్లు మండుతున్నాయి. బాగా జ్వరం వొచ్చినట్టు వుంది.

ఆ ప్రకాశంగాడు పోతే బాగుండుననిపించింది. పక్కగదిలో వాడూ పార్వతీ నవ్వుకుంటూనే వున్నారు. వాడు మద్రాసులో ఏదో సినిమా కంపెనీలో ఏదో వుద్యోగం చేస్తున్నాడుట. గిరజాల జుట్టూ వాడూ.... సినిమా కబుర్లంటే చాలు—పార్వతికి మతిపోయి విచక్షణాజ్ఞానం నశించిపోతుంది.

కళ్లు మూసుకుని నిద్రపోయే ప్రయత్నం చేసాడు స్వామి. పక్కగదిలో శబ్దాలు చెవులనీ మనసునీ కూడా బాధపెడుతున్నాయి. పార్వతి పెద్ద సమస్యగా కనిపించింది. ఈమెలో చూడడానికి ఎంత అందంవుందో, చూడలేని అంత లోపమూ వుందనిపించింది. ఎన్నాళ్లనించో లోలోపల దాచుకున్న కోపం క్రమక్రమంగా బయటికి వొస్తోంది. జ్వరం కన్న ఎక్కువ వేడిగా మండిస్తోంది.

కలత నిద్ర-వాళ్ళ శబ్దం-తెలివి రావడం.

రెండుమూడు సార్లయిందలాగ.

చివరికి అతనికి ప్రచండమైన కోపం వొచ్చింది. గట్టిగా, "పార్వతీ!" అని పిలిచాడు. ఆమె రాగానే, "అతన్ని వెళ్ళమను" అన్నాడు.

"అదేమిటండీ! ఇంటికొచ్చిన మనిషిని...." అంది పార్వతి.

"వెళ్ళమను" అన్నాడు కర్కశంగా.

"అది సభ్యత కాదని మీరే చెప్పేరుగా!" అంది వెక్కిరింపుగా, పార్వతి.

అతను నిలబడ్డాడు.

"మీరే చెప్పండి—" అంది పార్వతి

కొంచెం కోపంగా.

ఆ మాటలు పెదవులు దాటడం, ఛెళ్ళున ఆమె చెంపమీద అతను కొట్టడం, ఒకేసారి జరిగేయి.

పార్వతి తెల్లబోయింది.

అతను మళ్ళీ కొట్టేడు—రెండో చెంప మీద. తెరతొలగించి అవతలి గదిలో వెళ్ళే సరికి అప్పుడే జారుకుంటున్నాడు ప్ర శం.

స్కౌండ్రల్!

రోగ్!

అరుస్తోన్నట్టు అన్నాడు. పార్వతి గోడకి ఆనుకుని నిలబడింది. దీపపు వె గులో బుగ్గలమీద ఎర్రటి చారలు స్పష్టంగా కనిపి స్తున్నాయి.

"నీకేమయినా బుద్ధి ఉందా? నేను చ్చా నని అయినా వాడితో ఆ దరిద్రపు బుర్లు మానలేవా?" అన్నాడు స్వామి మం మీద కూర్చుంటూ.

పార్వతి తల తిరిగిపోతున్నట్టు గోడకి ఆనుకునే జారి కిందని కూర్చుని చీరకొ గులో ముఖం దాచుకుని నిశ్శబ్దంగా ఏడుస్తో .

"నాక్కనిపించకు — అవతలికి పో" అన్నాడు స్వామి. అతని కోపం ఏకీ తగ్గ లేదు.

పార్వతి లేవలేదు.

ఆమె నిశ్శబ్దంగా ఏడుస్తూనే ఉంది


మోటగా ఆమెని చేతులుపట్టుకు లేవ తీసి అవతలి గదిలో కూర్చోబెట్టేడు స్వామి. అతనిలోఉన్న పశుత్వం అంతా ఆ క్ష ంలో విజృంభించింది. అతను విన్న గుసగుస .... పార్వతి మీదని వికారంగా ఆ క్ష ంలో విజృంభించాయి.

"మళ్ళీ నాక్కనపడకు—భరిం గలిగి నంత భరించాను. ఏం చేస్తానో నాకు తెలీదు.... ఉదయం వెళ్ళిపో. లేచేసరి నాకు కనిపిస్తే జరిగేదానికి బాధ్యుడని. ాదు" అన్నాడు స్వామి. అతనికి అంతా డకల లాగ ఉంది.

ఈనాడు తలుచుకుంటే, ఆమె లాగ వుందో! నని ఆలోచన వొచ్చింది స మికి.

ఆ మర్నాడు లేచేసరికి ఆమె —ఆమె సూట్‌కేసు కూడాలేదు. ఆ రాత్రి అంతా తనకి జ్వరం—కలత నిద్రలో ఏదో అరుస్తూ ఉండడం జ్ఞాపకం వున్నా, అదే మిటో అతనికి తెలీదు.

"పీడ వొదిలింది" అని తనకి తా అను




కున్నాడు స్వామి. ఈ రెండు గదుల ఇంట్లోంచి పార్వతి వెళ్ళిపోతే, స్వేచ్ఛగా ఊపిరి తీసుకోగలిగే అవకాశం దొరికింది— జీవితాంతం, ఆమె ఇంక కనిపించకపోతే చాలు అనుకున్నాడు స్వామి. అప్పుడు. ఆరోజు.

ఇప్పుడు—నాలుగు నెలల తరవాత— ఎలాగో వుంది.

హోటల్ భోజనం. నిజానికి పార్వతి వంట కన్న ఇది చాలా నయం. ఆమెకి వంట మరీరాదు. అస్తమానం ఏదో చిన్న చిన్న ప్రమాదాలు జరుగుతూనే ఉండేవి.... కాని, రుచిలేని ఆమె వంటకాలు అతన్నెప్పుడూ బాధించలేదు. అన్నీ క్షమించినా....

వొద్దు వొద్దనుకుంటూన్న జ్ఞాపకం.... ఆ వుదయం వొచ్చిన ఉత్తరం అన్ని ఆలో చనలనీ తోసుకుని బయటికి వొస్తోంది.

ఆ ఉత్తరం.... పార్వతి రాసింది.

డ్రాయర్‌లోంచి తీశాడు.

మడతలు విప్పి, చదివాడు.

శ్రీ స్వామిగారికి:

మీరు బాగున్నారని ఆశిస్తాను.

ఉత్తరాలు రాయడం నాకు బాగారాదు— అంచేత రాయాలనుకున్నవన్నీ రాయలేక పోతున్నాను. క్షమించండి. ఒక్క ఉత్తరం విషయంలోనే కాదు—అన్ని విషయాలలో నూను. నేను చేసింది తప్పేనని గ్రహించాను.

అప్పటి పార్వతిని కాను.

చూస్తే మీకే తెలుస్తుంది.

మీరు కాదనరని ఆశిస్తూ,

పార్వతి.

అంతే.

ఉత్తరం చూడగానే నిర్ణయింపలేని తన ఆలోచనలకి ఎలాగో అతిరిక్తంగా వుందని పించి, అతనికి చాలా కోపం వొచ్చింది. క్షమించండి అని ఆమె తనని ఆదేశిస్తోంది!

ఆ కోపంలో ఉదయం నించీ ఒక ఆలో చన అతన్ని పీడిస్తోంది.

భర్తగా, తన బాధ్యత తాను నిర్వహిం చాడా?

జవాబుగా అతనికెన్నో మాటలు విని పిస్తున్నాయి.

ఉదయం నించీ తుఫానులో సముద్రం లాగ వుంది అతని మనస్సు.

అందుకే, ఆఫీసరు రెండుసార్లు పిలిచి తనని విమర్శిస్తే తాను జవాబివ్వలేదు క్షమాపణ చెప్పలేదు. పైవాడి కళ్ళల్లో ఏజన్సీ చూచాయగా కనిపించినట్టయింది, సాయంత్రం ఓవర్‌టైముకి వుండలేనని చెప్పినప్పుడు.

కానీ....

ఏదీ ఎటూ తెగడంలేదు.

టేబిల్‌మీద పుస్తకాల షెల్ఫు నాలుగు అరలది వుంది. దాని ముందు అందమైన ముఖంలో పెద్ద పెద్ద కళ్ళతో పార్వతి ఫొటో ఉంది.

తానేం చెయ్యాలి?

పిడికిలి బిగించి, డామిట్! అని టేబిల్ మీద గట్టిగా గ్రుద్దేడు స్వామి.

షెల్ఫు మీదని ఎప్పటిదో బాటిల్ ఆ ఉదుటుకి కిందపడి ముక్కలైంది. నాలుగు వేళ్ళూ తెగాయి.

బాగా రక్తం వొస్తోంది.

లేచి చెయ్యి కడిగాడు.

పంచదార అంటించి, తడిగుడ్డ చుట్టాడు. చాలా బాధగా వుంది.

రెండువేళ్ళు ఎక్కువగా కోసుకున్నాయి.

దీపం ఆర్పకుండానే నీరసంగా కళ్ళు మూసుకున్నాడు. ఉదయం పనిమనిషి గొడవకి లేచేడు.

వేళ్ళు కదపలేక పోయాడు.

డాక్టర్ దగ్గరికి వెడితే కుట్లువేశాడు — నిన్న రాత్రి రానందుకు చీవాట్లు పెట్టేడు

మూడువారాలు చెయ్యికి సెలవు. రెండు వేళ్ళమీద బేండేజీ.

సెలవు కోసం అర్జీ పంపేడు.

మెడికల్ సర్టిఫికేటు కావాలిట!

స్వామి అదీ పంపేడు.

సెలవు మంజూరు అయింది. ఆ కాగితంతో పాటే అతనికి బదిలీ కాగితం కూడా వొచ్చింది.

ఏజన్సీకి.

అడవుల్లోకి.

స్వామికి ఏదో ఆలోచన వొచ్చింది.

సూట్‌కేస్ సర్దుకున్నాడు. బస్‌స్టాండులో గంట నిలబడి బస్ ఎక్కేడు.

సూర్యోదయం అవుతోంటే ఆ ఊరు చేరాడు.

పార్వతి ఇంటికి.

వెళ్ళేసరికి ఇంట్లో ఎవరూ లేనట్టు ఉంది.

తలుపు వేసి వుంది.

ఒకసారి తలుపు తట్టేడు.

జవాబు లేదు.

మళ్ళీ.

మళ్ళీ.

సూర్యుడి కిరణాలు తన వీపుమీద పడు తున్నాయి. లోపల మరీ నిశ్శబ్దంగా వుంది.

ఈసారి గట్టిగా తలుపు తట్టేడు.

లోపలనించి గడియతీసిన చప్పుడు:

తలుపులు తెరుచుకున్నాయి.

పార్వతి.

స్నానం చేసి, తడిజుత్తు బుజాలమీదికి జారుతోంటే. ఎలాగో వుంది, పార్వతి.

ముఖాన కుంకుమ. అంతే. ఏమిటో కొత్తగా వుంది, పార్వతి.

తనని చూస్తూ, అలాగే నిలబడి పోయింది.

ఆమె....

అతను జాగ్రత్తగా, నమ్మలేనట్టు చూశాడు.

అప్పటి పార్వతి కాదు.

కానేకాదు.

రెండుబుగ్గల మీదా, మచ్చలు.

ఇప్పుడిప్పుడే మానుతోన్న, కాలిన, మచ్చలు. రెండు బుగ్గల మీదా.

ఆనాటి తన వేళ్ళు కోపంగా వేసిన దెబ్బల జాడల్లాగ. ఎర్రగా, నల్లగా....వికారంగా.

అతని కళ్ళు చూస్తోన్న పార్వతి రెండు చేతుల్లోనూ చెంపలు దాచుకుంది.

చేతుల మీదా మచ్చలు.

పార్వతి వేళ్లతో కళ్లుమూసుకుంది.

లేత లేత ఎండలో కొత్తగా వుంది పార్వతి.

అప్పటి పార్వతి కాదు.

గొంతుక సవరించుకున్నాడు స్వామి.... మాట సులభంగా పెగిలిరాలేదు.

"నీ ఉత్తరం అందింది...."

కళ్ళ మీంచి వేళ్ళు తీసింది పార్వతి.

క్షణకాలం అతని ముఖంలోకి చూసి, చెంపల మీంచి రెండుచేతులు తీసేసి, "లోపలికి రండి" అంది పార్వతి.

ఆమె వెనక నడిచాడు స్వామి.

వరండాలో మంచం మీద కూర్చున్నాడు.

"కాఫీ తెస్తాను....ముఖం కడుక్కోండి"

తువ్వాలు తెచ్చి ఇచ్చింది.

అతను వొచ్చేసరికి పార్వతి వంట ఇంట్లో కట్టెల పొయ్యితో కుస్తీపడుతోంది.

తన ఇంట్లో గేస్‌స్టవ్ వుండేది. దానితోనే, సతమత మయేది పార్వతి!

గ్లాసులో కాఫీ తెచ్చింది.

చేదుగా వుంది మొదటి సిప్.

పార్వతి ఎదురుగా స్తంభానికి ఆనుకుని కూర్చుంది. నీడలో ఆమె ముఖం అంత సౌందర్యరహితంగా లేదు.

తల వొంచుకుని ఆలోచిస్తోంది ఆమె.

అతను మంచం మీద కూర్చుని కాఫీ తాగుతున్నాడు.

క్రమంగా ఆ రుచి బాగుంది.

''అందరూ ఏరీ?'' అన్నాడు స్వామి.

''మిగిలిన అందరూ మామయ్యగారి ఇంటికి వెళ్లేరు నాన్న పక్కఊరి కెళ్ళేడు"

''నువ్వు?"

క్షణం ఆగి, ''వెళ్లలేదు''అంది పార్వతి.

"ఇటు చూడు"

పార్వతి నెమ్మదిగా తల ఎత్తింది.

''ఎందు కలాగ చేశావు?"

పార్వతి బిత్తరపోయింది.

"నిజం చెప్పు" లాలనగా అన్నాడు.

"అసహ్యంగా—ఉన్నా కాదూ?"

"లేదులే....కాని, ఎందుకలా చేశావు?''

"ప్రమాదం జరగింది....''

"ఎక్కడ?"

"పొయ్యి దగ్గర...."

నమ్మలేనట్టు చూశాడు....నిజం తనకి తెలుసును. కాని, పార్వతి తన ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలి....అదీకాక ఎంత దగ్గరి వాళ్ళ మధ్యనైనా ఏమీ లేకుండా ఉండదు.

పాపం!

పార్వతి!

"చాలా పొరపాటు చేశావు పార్వతీ!.... నాకు చాలా బాధగా ఉంది!"

ఏదో అనబోయి, ఆగి, ముఖం తిప్పుకుంది పార్వతి.

''అవును....అద్దం చూసుకున్నాను"

తడి తడిగా వుంది గొంతుక.

"అది కాదు పార్వతీ! నాకు నువ్వెప్పటిలాగే వున్నావు-నిజానికి....అప్పటికన్నా..."

పార్వతి ముఖం తిప్పుకుని, దించుకుంది.

"ఇలాగ రా....''

ఆమె కదల్లేదు.

"రా, పార్వతీ!''

ఆమె కదల్లేదు. స్తంభానికింకా దగ్గిరగా ముడుచు పోయింది.

అతను చేతిలో గ్లాసు కిందపెట్టి నిలబడి ఆమెని లేవనెత్తేడు.

తన పక్క కూర్చోబెట్టేడు.

దగ్గరగా తీసుకున్నాడు.

"ఇప్పుడు నమ్ముతావా?''

ఈ సారి అతనిలోకి ముడుచుకుపోయింది పార్వతి.

నిమిషాలు సెకండ్లలాగ.

హఠాత్తుగా పార్వతి వేళ్లకి అతని వేళ్ల తగిలాయి. ఒక్కసారి కూర్చుని,"ఏమిటది?" అంది.

''దెబ్బ తగిలింది....ఏక్సిడెంట్''

"ఎప్పుడు?''

''నాలుగురోజులైంది"

పార్వతి మృదువుగా అతని వేళ్ళు పరీక్షించి,"నా ఉత్తరంవొచ్చిన రోజునా?''అంది.

''అవును....''

బాధగా అతని కళ్ళలోకి చూసిందిపార్వతి.

అతనికి దగ్గరగా వొచ్చింది.

చాలా చాలా దగ్గరగా.

ఆమె కళ్ల ఎప్పటి కన్నా అందంగా వున్నాయి. అతనికి దగ్గరగా వెళ్లిన కొద్దీ వాటిలో ఒక కాంతి వొస్తోంది. అది చల్లటి, తియ్యటి కాంతి. □